

శ్రీరస్తు.

శ్రీమతే రామానుజాయనమః

ఆశౌచసర్వస్వము.

ఇది

విజయనగరనివాసులైన

శ్రీ పింజమూరి వేంకటనృసింహాచార్యులు

అయ్యవారలుగారిచే రచియింపబడి

వారిశిష్యులును [illegible] సంస్థానప్రభువారును

మహారాజశ్రీ శ్రీరాజా చెలికాని అప్పారావుబహద్దరువారి

ధర్మపత్నిగారును నగు

శ్రీరాజా చెలికాని వెంకయ్యమ్మ బహద్దరుగారి

సహాయమును చేసియును

వారిజామాతగారును [illegible] ఎస్టేట్ప్రభువులునగు

మహారాజశ్రీ శ్రీరాజా దామెర వెంకట సీతారా

మయ్యబహద్దరుగారిసహాయము చేతనను

ముద్రాపితంబై ప్రకటింపబడినది.

1917

Printed & Published by
D. Sanyasi for the Proprietor,
at the Arsha Press,
Vizagapatam.

విషయసూచిక.

శ్రీరస్తు.

శ్రీభగవత్సాహాయ్యమస్తు.

శ్రీమతేహయగ్రీవాయనమః

శ్రీమతేరామానుజాయనమః

ఆశౌచసర్వస్వం.

కం॥ శ్రీమానినీమనోహరు ।
సేమముసమకూర్పమదిని సేవింతునునా ।
పామరతనాతడెంచక ।
కామితములనెల్ల నాకుకరుణనొసంగున్ ॥

తే॥గీ॥ చాలధర్మశాస్త్రంబుల జదువఁ చేసి ।
సంగ్రహములన్నిటినిగూడ జదివిచూచి ।
సుఖముగా బోధపడుటకై సులభవాక్య ।
తాశౌచ నఘువివేచన రచన జేతు ॥

మొదటి ప్రకరణము.

సంజ్ఞాపదములు.

నిత్యనైమిత్తికాది కర్మాచరణమునకు ప్రతిబంధకమైన యశుచిత్వమే యాశౌచమనబడును.

ఈ ఆశౌచము రజస్వలాశౌచమనియు, స్రావాశౌచమనియు, జాతాశౌచమనియు, మృతాశౌచమనియు, అతిక్రాంతాశౌచమనియు, సన్నిపాతాశౌచమనియు, నారు విధములై యుండును.

ఇందు రజస్వలాశౌచమనగా స్త్రీలకు రజోదర్శనమగుటవలన కలిగిన యశుచిత్వము. దీనినే ముట్టని యందురు.

స్రావాశౌచమనగా గర్భస్రావమువలన గలిగెడి యశుచిత్వము. ఏడవమాసము ప్రవేశించినపిమ్మట గలిగెడి గర్భపాతము ప్రసవముతో సమము.

జాతాశౌచమనగా పుట్టుకవలనకలుగు నాశౌచము. దీనినే పురుడందురు.

మృతాశౌచమనగా చావువలనకలుగు నాశౌచము. దీనినే మైల యందురు.

అతిక్రాంతాశౌచమనగా దాటిపోయిన పురుడుగాని మైలగాని అయియున్నది.

సన్నిపాతాశౌచమనగా నొకేసమయమందు రెండు గాని అంతకంటె ఎచ్చుసంఖ్యగలవిగాని యాశౌచములు వచ్చుట.

ఈ ఆశౌచమే దానిని వహించువారినిబట్టి సపిండాశౌచమనియును, సమానోదకాశౌచమనియును, సగోత్రాశౌచమనియును, అసగోత్రాశౌచమనియును, అసగోత్రవిశేషాశౌచమనియును, తిరుగ నైదువిధములుగ నుండును.

ఇందు సపిండాశౌచమనగా సపిండులు పట్టవలసినయాశౌచమనుట. సపిండులనగా పురుషవిషయమందు ఏడు పురుషాంతరములవరకును (అనగా కూటస్థుని మొదలు చేసి తననున్ను జననమునుగాని మరణమునుగాని పొందినవానినిన్ని లెక్కచూడగా సిద్ధరును కూటస్థకుమొదలేడుంతరములు దాటనివారు) కావలెననుట. స్త్రీవిషయమందు సపిండత్వము మూడుపురుషాంతరములవరకుండును.

సమానోదకులు అనగా కూటస్థునియొద్దనుంచి లెక్కచెయ్యగా తనకును జననమునుగాని మరణమునుగాని పొందినవానికిని ఏడుపురుషాంతరములుదాటి పదునాలుగు పురుషాంతరములు దాటని జ్ఞాతులనుట.

సగోత్రులు అనగా కూటస్థునియొద్దనుంచి లెక్కచెయ్యగా తనకును జననమునుగాని మరణమునుగాని పొంది

నవానికిని పదునాలుగు పురుషాంతరములు దాటి యిరువది యొక్క పురుషాంతరములు దాటని జ్ఞాతులనుట.

అసగోత్రాశౌచమనగా తనగోత్రస్థులుకాని మేన మామ మొదలగువారు పట్టవలసిన యాశౌచమనుట.

అసగోత్రవిశేషాశౌచమనగా తనగోత్రజులునుగాక తనకు దేహబంధుత్వమును లేకయుండెడి ఆచార్యులు మొద లగువారు పట్టవలసిన యాశౌచమనుట.

ఈక్రిందను మరికొన్ని ముఖ్యములగు సాంకేతికపద ములయర్థములను వివరించుచున్నాను.

క్షేత్రజుడు అనగా తన భార్యయందింకొకనివలన పుట్టినవాడును ఇంకొకనిభార్యయందు తనవలన పుట్టినవా డును.

మహాగురువు అనగా ఎవడు యథాశాస్త్రముగా (అనగా "ఋతావుపేయాత్" ఇత్యాది శాస్త్రవిధులప్ర కారము) కొడుకునుపుట్టించి జాతకర్మాదిసంస్కారములచే సంస్కరించి అనగా నతిశయముకలవానినిగా జేసి నియ మానుసారముగ వేదమును చదివించి జీవనమును కలుగ జేయుచున్నాడో అతడు మహాగురువనిపించుకొనును.

సంస్కారము (లేక శావసంస్కారము) అనగా శవ మునకు జరిగింపవలసిన క్రియావిశేషములు. అవి ఖననమని

యును, దహనమనియును, త్యాగమనియును, మూడువిధముల నుండును.

ఖననమనగా పాతిపెట్టుట.

దహనమనగా కాల్చుట. ఇది గాక అస్థిదహనమనియు ప్రతికృతిదహనమనియు రెండు దహనవిశేషములున్నవి.

ఇందు అస్థిదహనమనగా మొదట శవదహనము సమంత్రకముగా జరుగనియెడ నందలి ఎముకలను సంగ్రహించి వాటిని పిమ్మట సమంత్రకముగ దహనము చేయుట.

ప్రతికృతిదహనమనగా మొదట సమంత్రకముగ శవదహనము జరుగనియెడ చనిపోయినవారి ప్రతికృతిని చేసి దానిని దహించుట. ప్రతికృతియనగా మోదుగాకులచేత చేయబడిన చనిపోయినవారి ప్రతిమ యనుట.

త్యాగమనగా పారవేయుట.

(౧) పక్షిణీయనగా దినన్నరపరిమితిగల మృతాశౌచము. దినన్నరయనగా ఒకరాత్రిమధ్యగల రెండుపగళ్ళుగాని ఒకపగలు మధ్యగల రెండురాత్రులుగాని అయియున్నది.

---

(౧) పక్షిణీయనగా మూడుదినములయాశౌచమనుకొనుట కేవలము పొరపాటును అశాస్త్రీయమును నయియున్నది.

ఏకకాలమనగా ఒకపూటయందు మృతాశౌచము- అనగా రాత్రియందు తెలియబడెనేని యారాత్రిమట్టుకు ను- పగటియందు తెలియబడెనేని యాపగటిమట్టుకును నుండు మృతాశౌచమనుట.

అరుణోదయమనగా మరునాటిసూర్యోదయమునకు మూడుగడియలు వ్యవధియుండు కాలము.

అనుమరణమనగా భర్త చనిపోవుటకుపూర్వదినమందు గాని భర్త చనిపోయిన తరువాతిదినమందుగాని భార్యచని పోవుటయును తనభర్తకళేబరముతోకూడనగ్నిప్రవేశము చేసి చనిపోవుటయును భర్త చనిపోయినదినమునే కాలవశ మున భార్యచనిపోవుటయును.

శ్రోత్రియుడనగా వేదాధ్యయనసంపన్నుడు.

అచార్యుడు అనగా "ఉపనీయ తు యశ్శిష్యం" అను నిది మొదలుగాగల మనువుచే చెప్పబడిన లక్షణములుగల వాడై ఉపనయనముచేసి వేదాద్యుపదేశములు చేసినవా డు.

శిష్యుడు అనగా తనచేనుపనయనము చేయబడి వే దాదులు చదివింపబడినవాడనుట.

ఋత్విజుడనగా అగ్నిష్టోమాదియజ్ఞములయందు య

జమానుని చేత కోరబడినవాడై అట్టియజ్ఞములను మంత్రో
చ్చారణక్రియాదులచేత చేయించినవాడనుట.

యాజ్యుడనగా తనచేతనడిపింపబడిన యజ్ఞమునకుయ
జమానుడనుట. అనగా కర్త యనుట.

షండుడనగా నుచితకాలములయందు స్నానహో
మదానపితృదేవతార్చనలను చేయనివాడును తనశిశ్నము
ను ఛేదించుకొనినవాడును.

పాషండుడనగా నెవ్వడజ్ఞానమువలన వేదమును తన
యొక్క వర్ణాభిముఖ్యమును విడిచి హీనకర్మములయం
దుంచున్నాఁడో వాడు పాషండుడనబడును.

పతితుడనగా కులభ్రష్టుడు.

వృథాజాతుడనగా క్రియాగుణాదులచేత నొకప్ర
యోజనమునను సంపాదింపలేనివాడు.

సబ్రహ్మచారియనగా తనకుపనయనముచేసిన యా
చార్యుని చేత నుపనయనము చేయబడి తనతోకూడ నధ్య
యనము చేయబడిన వేదభాగముకలవాడనుట అనగా నొక
యాచార్యునిచేత నుపనయనములు చేయబడి చదివింపబడిన
వేదైకదేశముకలవారు పరస్పరము సబ్రహ్మచారులనబడు
దురు

మొదటిప్రకరణము ముగిసెను.

రెండవప్రకరణము.

పరిష్కారములు.

రెండుసంధ్యలను అనగా నాశౌచశేతకమందు నిష్క్రమణ చేయబడినప్రికారము రెండుసంధ్యలకొరకును పదుగడియల ముప్పదివిగడియలను (అనగా రాత్రిమొదట మూడుగడియల నలువదియైదు విగడియలనును, కొసనుమూడు గడియల నలువదియైదు విగడియలనును) విడిచి ఆమధ్యనున్న మిగతరాత్రిని అప్పటిరాత్రి ప్రిమాణానుసారముగ మూడువంతులువేయగా నందులో మొదటి రెండువంతులలోనును స్త్రీలుముట్టగుట పుట్టుక చావు ఇవి సంభవించెనేని వీటిశుద్ధివిషయమై ఆదినమునుంచి యేలెక్క చూడవలయును. మూడవవంతు రాత్రిలో పైనచెప్పంబడిన ముట్టగుట మొదలగునవి సంభవించెనేని మరునాటినుండి యే లెక్క చూడవలయును.

చనిపోయినపిమ్మట నేదినమందు ఖననాదికము చేయబడునో అనగా మరణదినముగాక మరియొకదినమందు ఖననాదికము చేయబడినయెడ నాదినమునుండి యారంభించియే మూడుదినములాశౌచమును నిర్ణయింపవలయును. ఈవిధి కన్యాబాలకుల విషయమే.

ఆహితాగ్ని కానివానికి అనగా నిత్యాగ్ని హోత్రము చేయనివానికి మరణదినమునుండి యారంభించియే దశాహాదివిధి.

ఆహితాగ్నియైనవానికి దహనదినమునుండి యారం భించియే దశాహాదివిధి-

ఇద్దరికిని అనగా అహితాగ్న్యనాహితాగ్ను లిద్దరి కిని సంచయన విషయమై అనగా బుగ్గి యెత్తిపోతవిషయ మై దహనదినమునుండి యారంభించియే చతుర్థాదిదిన ముల లెక్క చేయవలయును-

ఆశౌచము రాకముందారంభింపబడిన కృచ్ఛ్రాదికర్మా నుష్ఠానము ఆశౌచమధ్యమందు సమాప్తిని పొందింపబడిన యెడ నట్టి కర్మసమాప్తియైనపిమ్మట మిగిలియున్న దినము లయందే మైలయుండునుగాని కర్మానుష్ఠాన దినములలో మైలయుండదు. ఆశౌచానంతరమందు సమాప్తిని పొందిం పబడినయెడ నాయాశౌచము అతిక్రాంతాశౌచమగును- అనగా పదిదినములును దాటినపిమ్మట మూడుమాసములలో పల తెలియబడిన దశాహాశౌచము మూడుదినములే యుం డును అనునది మొదలుగాగల విధులకు లోబడిన యా శౌచమై యుండుననుట-

భర్తకుసంభవించిన యాశౌచములు అనగా పురుడు ను మైలయును భార్యకుగూడ నన్నివిషయములయందును సమానములు అనగా నేవిధముగాభర్తకు పురుడును మైల యును వచ్చి ఎన్నిదినములున్నను భార్యకుగూడ నాపురు డును మైలయు నన్నిదినములుండునని ఎరుంగునది- భార్య కుమాత్రమే రాదగినవైయట్లువచ్చినవి భర్తకురావు-

ఆశౌచముకలవారి సంపర్కము ఎవరైనను చేసినయెడ నెన్నిదినములు చేసిన నన్నిదినములే చేసినవారిమట్టుకే ఆ యాశౌచముండును.

వివాహముకాని యాడుపిల్ల జాతాశౌచ మృతాశౌచముల విషయములో సోదరులతో సమానురాలయ్యున్నది.

పదిదినములపురిటిలో శిశువుచనిపోయెనేని ఖననమునే చేయవలయును.

పదిదినములు దాటినపిమ్మట పండ్లుమొలచులోపలగాని ఆరవమాసమునకు లోపలగాని చనిపోయెనేని ఖననమునుగాని దహనమునుగాని చేయవచ్చును.

పండ్లుమొలచుటకుగాని ఆరవమాసమునకుగాని పిమ్మటనున్ను మూడుసంవత్సరములకుగాని పుట్టువెంట్రుకలను తీయుటకుగాని ముందుగానున్న పిల్లలుచనిపోయిరేని ఖననమునుగాని దహనమునుగాని త్యాగమునుగాని జరిగించవచ్చును.

పుట్టువెంట్రుకలను తీసినపిమ్మటను మూడుసంవత్సరములుదాటినపిమ్మటను చనిపోయినపక్షమందు దహనమును చేయవలయును.

ఉపనయనమైనను కాకపోయిననుగూడ నేడవసంవ

త్సరముప్రవేశించినపిమ్మట చనిపోయెనేని దహనసంస్కారమునే చేయువలయును.

ఖననము దహనము మొదలగుసంస్కారములయొక్క వికల్పము (అనగా దీనినిగాని దానినిగాని చేయుట) వివాహముకాని చిన్నదానివిషయములే. వివాహమైన చిన్నదానికి చౌలముకంటెపూర్వము మరణముసంభవించినను దహనసంస్కారమే చేయబడదగినది.

రెండవప్రకరణము ముగిసెను.

మూడవప్రకరణము.

రజస్వలాశౌచము.

ఋతుమతియైన దినము మొదలు అనగా ముట్టైనదినము మొదలు స్త్రీలకు మూడుదినములాశౌచముండును.

(౧)ముట్టైనదినము మొదలు పండ్రెండుదినములలో తిరుగ ముట్టయ్యెనేని మూత్రవిసర్జనమందువలెనే ఉదకముతో కడుగుటవలననే శుద్ధియగును. పండ్రెండుదినములు దాటిన పిమ్మట ఆరుదినములలో నయ్యెనేని స్నానమువలనశుద్ధి. ఆటుపిమ్మట నయ్యెనేని మూడుదినములాశౌచముండును.

---

(౧) ముట్టైనదినము మొదలు పదునేడుదినములలో తిరుగ ముట్టయ్యెనేని స్నానమువలన శుద్ధియగును పదునెనిమిదవ దినమున నయ్యెనేని యొకదినమాశౌచమును పందొమ్మిదవ దినమున నయ్యెనేని రెండుదినములాశౌచమును అటుపిమ్మటనయ్యెనేని మూడుదినములాశౌచమును నుండుట యాంధ్రాచారములు.

మూడవప్రకరణము ముగిసెను.

నాలవప్రకరణము.

స్రావాశౌచము.

మూఁడుమాసములలోఁగ గర్భస్రావమైనయెడ నా స్రావముసంభవించినస్త్రీకి స్వాభావికముగ ప్రతిమాసమందును సంభవించు ఋతువునందువలెనే మూఁడుదినములే యాశౌచముండును. ఆమీఁద నాలుగవమాసమందయ్యేనేని నాలుగుదినములును ఐదవమాసమందయ్యేనేని యైదుదినం

నారదీయే.

శ్లో. రజస్వలా యదిస్నాతా, పునరేవ రజస్వలా ।
అష్టాదశ దినాదర్వా, గశుచిత్వం నవిద్యతే ॥ ౧ ॥

శ్లో. ఏకోనవింశతేరర్వా, గేకాహంస్యాద్విగర్హితః ।
వింశత్యూర్ధ్వం రజఃకాలే, త్రిరాత్రమశుచిర్భవేత్ ॥ ౨ ॥

ఈశ్లోకములు 1911 వ సంవత్సరమున. చెన్నపురిలో, వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండు సన్సువారి ఆదిసరస్వతీనిలయ ముద్రాక్షరశాలయందుము ద్రితమైన ముహూర్తదర్పణము 137వ పేజీలో నుదహరింపబడినవి.

(౨) ఏస్త్రీకైనను నాలుగవమాసమందలి యాస్రావము కంసనుగానయ్యేనేని ఆమెభర్తకు మూఁడుదినములాశౌచమును, జ్ఞాతులకును ఆమెయొక్క కొడుకులకును కూతులకును స్నానమువలనశుద్ధియును, పక్షాంతరమున అనగా మరియొకగ్రంథకర్తయొక్క మతమున మృదుస్రావము కఠినస్రావమునను భేదములేక భర్తకును జ్ఞాతులకునుగూడ మూఁడుదినములాశౌచమును ఆంధ్రాచారములు.

(3) ఆస్రావమే ఐదవ ఆరవమాసముల యందయ్యేనేని భర్తకును జ్ఞాతులకును గూడ స్నానమాత్రమువలననే శుద్ధియగును. ఆయైదారుమాసములయందే యాస్రావమే కఠినముగానయ్యేనేని అనగా పిండరూపముగా నయ్యేనేని భర్తకునుజ్ఞాతులకును గూడమూడుదినములాశౌచముండును.

ఏడవమాసము మొదలామీదను గర్భపాతమైనయెడ భర్తకును జ్ఞాతులకును గూడ పదిదినములాశౌచముండును.

నాలవప్రకరణము ముగిసెను.

---

(3) ఆస్రావమే ఐదవ ఆరవమాసములయందు కఠినముగానైనను మృదువుగానైననుగూడ భర్తకును జ్ఞాతులకును మూడుదినములాశౌచముండుట యాంధ్రాచారము.

ఐదవప్రకరణము.

జాతాశౌచము.

---

(౪) మగశిశువును ప్రసవించినస్త్రీ ముప్పదియొకటవ దినమునను ఆడుశిశువును ప్రసవించినస్త్రీ నలువదియొకటవ దినమునను శుద్ధినొందును. అందు మొదటిపదిదినములును చూడబడదగకపోవుట వినబడగూడని మాటలు కలుగుట (అనగా నామొదటి పదిదినములలో నామెను చూడగూడదు ఆమెయొక్కమాటలను వినగూడదు అనితాత్పర్యము) మొదలగునాశౌచమును ఆపైని ముట్టుకొనబడదగకపోవుట కర్మార్హత లేకయుండుట అనునాశౌచమును ఆస్త్రీలు కలిగియుందురు.

ఏపురుషునకు సంతానముకలుగునో ఆపురుషుడు పురిటింటనుండుట మొదలగు సంపర్కము కలిగియుండెనేని అతనికిని ముట్టుకొనబడదగకపోవుట మొదలగునాశౌచము పదిదినములు నుండును.

మగపిల్లవాడుపుట్టినయెడ నాపిల్లవానితండ్రికిని సపిండజ్ఞాతులకును పదిదినములు పురుడుండును.

(౪) మగశిశువునుప్రసవించిన స్త్రీ ఇరువదియొకటవదినమునను ఆడుశిశువును ప్రసవించిన స్త్రీ ముప్పదియొకటవదినమునను శుద్ధినొందుట యాంధ్రాచారము.

అడుపిల్లపుట్టినయెడ నాపిల్లయొక్క సొంతఅన్నలకును సవతియన్నలకును వారికొడుకులకును తండ్రికిని పెదతండ్రిపినతండ్రులకును వారికుమారులకును తండ్రితండ్రికిని అతనిసోదరులకును పదిదినములు పురుడుండును.

(౫) కవలపిల్లలు కలిగినయెడ ఆపిల్లలతండ్రికి పండ్రెండుదినములు పురుడుండును

(౬) పురుడువచ్చినవారినందరినీ నాలుగుదినములవరకును నితరులు ముట్టుకొనగూడదు.

సమానోదకజ్ఞాతులకు పుత్రజననముకలిగెనేని మూడు దినములు పురుడుండును.

సగోత్రజ్ఞాతులకు పుత్రజననముకలిగెనేని యొకదినము పురుడుండుట వృద్ధాచారము.

పుత్రికాజననముకలిగెనేని మూడుపురుషాంతరములుదాటిన జ్ఞాతులెవ్వరికిని పురుడులేదు.

---

(౫) కవలపిల్లలుకలిగినను తండ్రికి పదిదినములే పురుడుండుట యాంధ్రాచారము.

(౬) పురుడువచ్చినవారిని శిశువుపుట్టినవెంటనే చేయబడుస్నానముకంటె ముందుముట్టుకొనగూడకపోవుట యాంధ్రాచారము. అట్టిస్నానమైనపిమ్మట కర్మానర్హతారూపమైనజాతాశౌచమే గాని ఇతరులు ముట్టుకొనగూడకపోవుటయను నాశౌచమాంధ్రులకక్కరలేదు.

ఏస్త్రీయైనను తనతల్లిదండ్రులగృహమందు ప్రసవించెనేని యాస్త్రీయొక్క తల్లిదండ్రులకు మూఁడుదినములు పురుడుండును. ఇతరగృహమందు ప్రసవించినయెడ లేదు. కొమార్తె ప్రసవించుటకై పయుక్తమై తల్లిదండ్రులసొమ్ము కర్చు పెట్టఁబడినపక్షమందు అన్యులగృహమందు ప్రసవించినను ఆప్రసవించినయామెతల్లిదండ్రులకు మూఁడుదినములు పురుడుండును.

మేనమామ సోదరులు పెదతండ్రిపినతండ్రులు మొదలగుబంధువులగృహమందు ప్రసవించెనేని వారికొకదినము పురుడుండును. ఇతరులగృహములందు ప్రసవించినను మేనమామమొదలగువారిసొమ్ము ఆప్రసవవిషయములో కర్చు పెట్టఁబడినయెడ మేనమామమొదలగువారికొకదినము పురుడుండును.

బంధువులుకానివారియిండ్లలో ప్రసవించినపక్షమందు ఆయిండ్లయజమానులకుగాని ఇండ్లకుగాని పురుడు లేదు.

(౧) క్షేత్రజునిపుట్టకయందు వానితల్లియొక్క పెండ్లిభర్తకును వానినిపుట్టించినవానికిని మూఁడుదినములు పురుడుండును. వారిజ్ఞాతులకు (అనఁగా తల్లిపెండ్లిభర్త పుట్టించినవాఁడును ఎవరో వారిజ్ఞాతులకనుట) ఒకదినముపురుడుండును.

ఐదవప్రకరణము ముగిసెను.

---

(౧) క్షేత్రజపుత్రవ్యవహారమే ప్రస్తుతము లేనందున నతనిపుట్టకయందు పైఁజెప్పిన రెండువిధములైనతండ్రులకును పురుడు బొత్తుగానే లేదు.

ఆరవప్రకరణము.

సపిండాదిమృతాశౌచము.

---

(౧) ఆడుపిల్లగాని మగపిల్లవాడుగాని పుట్టిన పదిదినములు దాటినపిమ్మట పండ్లుమొలచులోపలగాని చనిపోయెనేని తల్లిదండ్రులకును, ఒక్కతల్లికడుపునపుట్టిన సోదరులకును, సవతిసోదరులకును మైల పదిదినములుండును.

(౨) జ్ఞాతులకైతే ఆపిల్లగాని, పిల్లవాడుగాని ఖననము చేయబడినయెడ వెంటనే శుద్ధియగును. అనగా మైలలేదనుట. దహనము చేయబడినయెడ నొకదినము మైలయుండును.

(౩) పండ్లుమొలచుటకుగాని, ఆరవమాసమునకుగాని పిమ్మటనున్ను, మూడుసంవత్సరములకుగాని, పుట్టువెండ్రుకలు తీయుటకుగాని ముందుగానున్ను పిల్లలుచనిపోయిరేని

---

(౧) తల్లిదండ్రులకును సవతితల్లికిని సంస్కారమైనదిమొదలు మూడుదినములాశౌచముండుటయును అన్నదమ్ములకును సవతియన్నదమ్ములకును మైలలేకపోవుట యాంధ్రాచారము

(౨) జ్ఞాతులకు మయిలలేకపోవుటయు నాంధ్రాచారము

(౩) సంస్కారమైనదిమొదలు తల్లిదండ్రులకుమూడుదినములును, సొంతయన్నదమ్ములకును సవతియన్నదమ్ములకును వివాహముకాని సొంతయక్కచెల్లెండ్రకును వివాహముకానిసవతియక్కచెల్లెండ్రకును ఒక్కదినము మైలయుండుట యాంధ్రాచారము.

తల్లిదండ్రులకును, అన్నదమ్ములకును పదిదినములు మైల యుండును.

(౧౦) సపిండజ్ఞాతులకైతే. మగపిల్లవాని చావునందు ఖననము చేయబడిన పక్షమందొక దినమును, దహనము చేయుటగాని పారవేయుటగాని జరిగింపబడిన పక్షమందు మూడుదినములును మైలయుండును.

(౧౧) ఆడుపిల్ల మృతియందు ఖననము చేయబడినయెడ వెంటనే శుద్ధి. దహనముగాని పారవేయుటగాని జరిగింపబడిన పక్షమందు మూడుదినములు మైలయుండును.

(౧౨) ఉపనయనముకంటెగాని ఏడవ వత్సరముకంటె గాని ముందు బాలుడు చనిపోయినయెడ తల్లిదండ్రులకును

(౧౦) మగపిల్లవాడు చనిపోయినయెడ దహనఖననాదిభేదము లేకయే సపిండజ్ఞాతులకొకదినము మైలయుండుట యాంధ్రాచారము.

(౧౧) ఆడుపిల్ల చనిపోయినయెడ సపిండజ్ఞాతులకును దహనఖననాదిభేదము లేకయే సద్యశ్శుద్ధి అనగా మైల లేదనుట యాంధ్రాచారము.

(౧౨) ఉపనయనమైనను కాకపోయినను ఏడవ సంవత్సరము ప్రవేశించులోపల బాలుడు చనిపోయినయెడ తలిదండ్రులకు మూడుదినములు. పెంచుకొన్న తలిదండ్రులకును మూడుదినములు. ఈ రెండువిధములైన తలిదండ్రుల జ్ఞాతులకును మైలలేదు. ఆ చనిపోయిన బాలుని యన్నదమ్ములకును సవతియన్నదమ్ములకును పెండ్లికాని యక్కచెల్లెండ్రకును మూడుదినములు మైల. ఇది యాంధ్రాచారము.

అన్నదమ్ములకును పదిదినములు మైలయుండును.

జ్ఞాతులకు మూడుదినములు మైలయుండును.

(౧౩) కన్యక చౌలమునకు అనగా పుట్టువెండ్రుకలు తీయుటకు పిమ్మటగాని మూడు సంవత్సరములు దాటిన పిమ్మటగాని వాగ్దానము చేయుటకుముందు (అనగా ఫలానా వానికి పిల్లనిచ్చెదనని ఖరారు చేయుటకుముందు) చనిపోయినయెడ తల్లికిని తండ్రికిని సోదరులకును పదిదినములు మైలయుండును.

జ్ఞాతులకొకదినముమాత్రమే మైలయుండును.

(౧౪) వాగ్దానమునకు పిమ్మట వివాహమునకుముందు చనిపోయినయెడ తలిదండ్రులకును సోదరులకును పదిదినములు మైలయుండును.

జ్ఞాతులకు మూడుదినములు మైలయుండును.

ఈయవస్థయందే రజస్వలయై చనిపోయెనేని జ్ఞాతు

---

(౧౩) కన్యక చౌలమునకు పిమ్మటగాని మూడు సంవత్సరములు దాటిన పిమ్మటగాని వాగ్దానము చేయుటకుముందు చనిపోయెనేని తలిదండ్రులకును పతులకిని అన్నదమ్ములకును [illegible]మైనది మొదలు మూడుదినములు మైలయుండుట గ్రంథాంతరాచారము.

(౧౪) వాగ్దానమునకు పిమ్మట వివాహమునకుముందు చనిపోయినయెడ తలిదండ్రులకును పతులకిని అన్నదమ్ములకును మూడుదినములు మైలయుండుట గ్రంథాంతరాచారము

లకును పదిదినములే మైలయుండును.

(౧౫) వాగ్దానము జేయబడి వివాహముకాక ముందు రజస్వలయైన కన్యక చనిపోయెనేని యావాగ్దానమును పొందినవరునకును అతనిజ్ఞాతులకును మూడుదినములు మైలయుండును.

ఆకన్యక అట్టిభర్తయొక్క గోత్రమును చెప్పియే దహింపబడదగినది అనగా నట్టిభర్తయొక్క గోత్రముచెప్పియే సంకల్పాదికమును చెప్పి దహింపబడదగినదనుట.

(౧౬) వాగ్దానము చేయబడనిదైనను ఎనిమిదవసంవత్సరము ప్రవేశించినపిమ్మట కన్యక చనిపోయినయెడ జ్ఞా

---

(౧౫) వాగ్దానము చేయబడి వివాహముకాకముందు రజస్వలయై కన్యకచనిపోయెనేని యావాగ్దానమును పొందినవరునకును అతనిజ్ఞాతులకును పదిదినములు మైలయుండును యాంధ్రాచారము.

కాని పైనవివరింపబడిన యాచారములు ద్రావిడులచేతను ఆంధ్రులచేతనుగూడ ప్రస్తుతమాచరింపబడుచుండుట లేదు.

(౧౬) ఈసూత్రమువలన చూడకులకు లేదు అనగా చౌలమునకుపిమ్మట నేని మూడుసంవత్సరములలోపల చౌలమైనపిమ్మట గాని ఎన్నిసంవత్సరములైనను వాగ్దానముచేయబడనిదై రజస్వలకాకచనిపోయినయెడ పైనవిధి పట్టినదని కారణము తెలియవచ్చుచున్నది ఆసపిండులకును మూడుదినములును జ్ఞాతులకొకదినము మాత్రమే మైలయుండుట యాంధ్రాచారము.

తులకు మూడుదినములు మైలయుండును. తలిదండ్రులకును సోదరులకును పదిదినములుండును.

ఉపనయనమైనను కాకపోయినను గూడ నేడవవత్సరము ప్రవేశించిన పిమ్మట బాలుడు చనిపోయినేని తలిదండ్రులు సోదరులు మొదలుగాగల సపిండజ్ఞాతులందరికిని పదిదినములు మైల యుండును.

మహాగురువు చనిపోయినయెడనే కుమారునకు పండ్రెండుదినములు మైలయుండును.

సమానోదకజ్ఞాతులలో నుపనయనము కానివాడు చనిపోయెనేని వెంటనే శుద్ధియగును ఉపనయనమయిన వాడు చనిపోయెనేని మూడుదినములు మైలయుండును.

సగోత్రజ్ఞాతులలో నుపనయనమైనవాడు చనిపోయెనేని యొకదినము మైలయుండును.

అసపిండజ్ఞాతులకు అనగా నేడుతరములు దాటినవారికి పెంపకమివ్వబడినవానికి తనజనకతల్లిదండ్రులమరణమందు నుమూడుదినములే మైలయుండును.

సపిండజ్ఞాతులకుగాని అసపిండజ్ఞాతులకుగాని పెంపకమివ్వబడినవానికి తనజనకతల్లిదండ్రులకు వేరేపుత్రాద్యనంతరకర్తలులేక వారియుత్తరక్రియలు తాను చేయవలసివచ్చెనేని పదిదినములు మైలయుండును.

ఏకకుటుంబసోదరునికి అనగా జనకతండ్రియొక్క మరియొకకుమారునికి అనంతరకర్తలు లేకపోయినను ఇటువలెనేయని యెఱుంగునది.

(౧) వివాహమైనవానిని విడిచి యన్యుని భర్తగా నాశ్రయించిన స్త్రీ చనిపోయెనేని దానివివాహభర్తకును జారభర్తకునుగూడ మూఁడుదినములు మైలయుండును. వివాహభర్త జ్ఞాతులకును జారభర్త జ్ఞాతులకునుగూడ నొకదినము మైల. వివాహభర్త చనిపోయినను జారభర్త చనిపోయినను నాస్త్రీకిగూడ మూఁడుదినములు మైల. వివాహభర్తగాని జారభర్తగాని తనయెదుటగాక నింకొకస్థలమందు చనిపోయినయెడ నాస్త్రీకిని అట్టిస్త్రీ తమయెదుటగాక నితరస్థలమందు చనిపోయినయెడ వివాహభర్త జారభర్తలకునుగూడ నొకదినము మాత్రమే మైల. తనకంటె తక్కువజాతిపురుషుని జారునిగా చేసికొనిన స్త్రీయైనను చాలమందిపురుషులను జారులనుగా చేసికొనిన స్త్రీయైనను చనిపోయిరేని వారిపెండ్లిభర్తలకు మైల లేదు.

(౨) క్షేత్రజుడు చనిపోయినయెడ వానితల్లిపెండిలిభర్తకును, వానినిపుట్టించినవానికిన్ని, మూఁడుదినములు మై

---

(౧) ఈవాక్యములలోనియాచారములు ప్రస్తుతమాచరణములో లేవు.

(౨) క్షేత్రజపుత్రవ్యవహారమే ప్రస్తుతములేనందున నతనిమరణమందు పైనిచెప్పబడిన రెండువిధములైన తండ్రులకును అట్టితండ్రులమరణమందతనికి మైలయుండుట బొత్తుగానే లేదు.

లయుండును. వారియొక్క భార్యల జ్ఞాతులకును ఒకదినము మైలయుండును. ఉపనయనము కాకముందు చనిపోయెనేని వారికి మైలలేదు. పైరెండువిధములైన తండ్రులును చనిపోయినప్పుడు క్షేత్రజునకు మూడు దినములు మైల యుండును.

(౧)షండుడు పాషండుడు పతితుడు వృథాజాతుడు (౨)వ్యభిచరించెడి స్త్రీ (అనగా నొకజారపురుషునే ఆశ్రయించినదానివిషయమై ఇదివరలో నాశౌచము విధించియున్నారు గనుక నిచట వ్యభిచరించెడిస్త్రీ యనగా ననేకపురుషులతో వ్యభిచరించెడి స్త్రీ యనుట) క్లీబస్త్రీ యును అనాశ్రమి (అనగా ఆశ్రమహీనుడు అనగా నెవడైతే గృహస్థాశ్రమమునువిడిచి వానప్రస్థుడైనను సన్న్యాసియైనను కాకుండనుండునో వాడును ఎవడైతే [illegible]యుండియును వివాహము చేసుకొనడో వాడుననుట) అట్టియనాశ్రమియును సన్న్యాసియును మృతినొందిరేని వారిసపిండసమానోదకసగోత్రబంధ్వాదులకు వెంటనే శుద్ధి అనగా మైలలేదనుట.

---

(౧) షండ పాషండ వృథాజాత అనాశ్రమిల మరణమందు మైల పట్టుచునే యున్నారు.

పతితునిమరణమందు మైలపట్టుట లేదు.

(౨) వ్యభిచరించుస్త్రీ యనగా యిల్లువిడిచి కేవల[illegible]కు పోయినదానిమరణమందుతప్ప ఇంటనున్నదానిమరణమందు మైల పట్టుచునే యున్నారు.

(౧౭) తమతమసపిండాదులమరణమందు బ్రహ్మచారులకును సన్యాసులకును మైల లేదు

ఆరవప్రకరణము ముగిసెను.

---

(౧౭) బ్రహ్మచారులును సపిండాదులమరణమందు మైలపట్టుట గూఢాంధాచారము-

ఏడవ ప్రకరణము.

అసగోత్రమృతాశౌచము.

తల్లియెదుటగాని తండ్రియెదుటగాని వివాహమైన కొమార్తె చనిపోయినయెడ వారికి మూడుదినములు మైలయుండును. వారియెదుటగాక నింకొకస్థలమందు చనిపోయినయెడ దినన్నర.

(౧౨) అటువలెనే తలిదండ్రులును వివాహమైనకొమార్తెయెదుట చనిపోయినయెడ నామెకును మూడుదినములు మైల యుండును. ఆమెయెదుటగాక నింకొకస్థలమందు చనిపోయినయెడ దినన్నర.

కుమార్తెకుమారుడు తమయెదుట చనిపోయినయెడ తల్లితండ్రికిని తల్లితల్లికిని మూడుదినములు మైల. తమయెదుటగాక నింకొకస్థలమందు చనిపోయినయెడ దినన్నర.

ఆ చనిపోయిన కుమార్తెకుమారుడుపనయనము కాని వాడైతే దినన్నరయే మైలయుండును. ఉపనయనము కాని వాడయినను ఏడవసంవత్సరము ప్రవేశించినవాడై చనిపోయెనేని మూడుదినములు మైల యుండును.

---

(౧౨) కుమార్తె తనయెదుటగాని ఇతరస్థలమందుగాని తనతల్లిగాని తండ్రిగాని చనిపోయినయెడ మూడుదినములు మైల పట్టుటయు పదిదినములు దాటినపిమ్మట సంవత్సరములోపల నట్టిచావుకబురు వినినయెడ దినన్నర మైల పట్టుటయును అంధ్రాచారము.

ఉపనయనమైనవాడు మేనమామ అన్యగోత్రికులైన పినతల్లి పెత్తల్లులు వీరియెదుటచనిపోయెనేని వీరికిమూడు దినములుమైలయుండును- వీరియెదుటకాకుండా నింకొకస్థలమందు చనిపోయెనేని దినన్నరమైల- ఉపనయనముకాని వాడు చనిపోయెనేని దినన్నరమైల-

(౧౯)మేనమామ పినతల్లి పెత్తల్లి మేనమామభార్య వీరు ఎవనియెదుటచనిపోవుదురో వానికి మూడుదినముల మైలయుండును- తనయెదుటగాక నింకొకస్థలమందు చని పోయిరేని దినన్నరమైలయుండును-

ఉపనయనముకాని మేనమామయును, వివాహము కానిపినతల్లియును తనయెదుటచనిపోయెనేని దినన్నరమై లయుండును- తనయెదుటగాక నింకొకస్థలమందుచనిపో యెనేని స్నానమాత్రమువలననే శుద్ధియగును-

తల్లితండ్రి తలితల్లి వీరుతనయెదుట చనిపోయిరేని మూడుదినములు మైలయుండును. తనయెదుటగాక నింకొ కస్థలమందు చనిపోయిరేని దినన్నరమైలయుండును-

తనభార్యబ్రతికియుండగా నామెతల్లిగాని తండ్రిగాని

---

(౧౯) ఉపకారియగు మేనమామ తనయెదుటచనిపోయినను మరి యొకస్థలమందు చనిపోయినను మూడుదినములు మైలపట్టుట ఆం ధ్రాచారము-

తనయెదుటచనిపోయినయెడ మూఁడుదినములు మైలయుండును. ఇంకొకస్థలమందు చనిపోయినయెడ దినన్నరమైలయుండును.

తనభార్యచనిపోయినపిమ్మట వారుచనిపోయిరేని ఒకదినముమైలయుండును. తనభార్యచనిపోయినను ఆమెయందుగలిగిన సంతానమున్నయెడ ఆభార్యయొక్కతల్లిదండ్రులు తనయెదుటచనిపోయిరేని మూఁడుదినములును ఇతరస్థలమందుచనిపోయిరేని దినన్నరయును మైలయుండును

(౨౦)తనభార్యచనిపోయి ఆమెయందు సంతానముకూడ లేకుండ నున్నస్థితిలోగూడ భార్యయొక్క తల్లిదండ్రులు చనిపోయిరేని ఒకదినము మైలయుండును.

ఉపనయనముకాకముందు అన్యగోత్రికులకు పెంపకమివ్వబడినవాఁడు చనిపోయెనేని జనకతల్లిదండ్రులకు మూఁడుదినములు మైలయుండును. జ్ఞాతులకొక్కదినముమాత్రమే మైలయుండును.

ఉపనయనముకాకముందు అన్యగోత్రికులకు పెంపకమివ్వబడినవాఁడు దత్తకుటుంబముయొక్క పురుషమయిలనే పట్టవలయునుగాని జనకకుటుంబసంబంధమయిన పురుషమయిలలను పట్టనక్కరలేదు.

---

(౨౦)భార్యయును పిల్లలును లేనిఅల్లునియెదుటఅత్తమామలుచనిపోయిరేని దినన్నరమైలపట్టుట యాంధ్రాచారము.

ఉపనయనమైనపిమ్మట అన్యగోత్రికులకు పెంపకమియ్యబడినవాడు జనకకుటుంబ దత్తతకుటుంబములయొక్క పురుడు మైలలను పట్టవలయును. వానికి రెండుకుటుంబములయందు పుట్టినకన్యలనూ వివాహము చేయగూడదు.

మేనమామకొడుకులును కూతులును కొమార్తెకొమార్తె పినతల్లిపెత్తల్లులయొక్క కొడుకులును కూతులును మేనత్తకొడుకులును కూతులును (౨౧) అక్కచెల్లెండ్రును వారికొడుకులును కూతులును అన్నదమ్ములకూతులును పినతండ్రి పెత్తండ్రులకూతులును కొడుకుకూతురును వీరిమరణమందు దినన్నరమైలయుండును.

ఈమైలయనునది వివాహమైన స్త్రీలయొక్కయును ఉపనయనమైన పురుషులయొక్కయును మరణమందేయని తెలియవలయును.

పైనవివరింపబడిన బంధుత్వములు కలస్త్రీలువివాహము కాకమునుపు పురుషులుపనయనము కాకమునుపును చనిపోయినయెడల పైననుదాహరింపబడిన దినన్నరమైలగల వారికి స్నానమాత్రమువలననే శుద్ధియగును.

సవతితల్లియొక్కతల్లి, తండ్రి, సోదరుడు, సోదరి

(౨౧) అక్కచెల్లెండ్రును వారికొడుకులును తమయొద్ద చనిపోయి కాని మూడుదినములును ఇతరస్థలమందు చనిపోయిన దినన్నరయును మైలపట్టుట యాంధ్రాచారము.

కొమార్తె, సోదరీపుత్రిక, సోదరీపుత్రుడు, సోదరపు పుత్రుడు, సోదరపుత్రిక, కొమార్తెకొమారుడు, కొమార్తె కొమార్తె, వీరిమరణమందొకదినము మైలయుండును.

(౨౨)తల్లితండ్రి, తల్లితల్లి, మేనమామ, మేనమామకూతులు, మేనమామకొడుకులు. పినతల్లిపెత్తల్లులు, వారికొమాళ్లును కొమార్తెలును, కొమార్తెకొమార్తె, అక్కలు, చెల్లెండ్రు, వారికొడుకులును, కూతులును, అన్నలును, తమ్ములును, వారికొడుకులును, కూతులును, మేనత్త, ఆమెకొడుకులును, కూతులును, పినతండ్రిపెత్తండ్రులు, వారికొడుకులును, కూతులును, కొమారునికొమార్తె, తండ్రితండ్రి, తండ్రితల్లి, వీరుచనిపోయిరేని వివాహమైనస్త్రీకి పక్షిణీ యుండును.

ఈపక్షిణీయనునది వివాహమయినస్త్రీలయొక్కయును ఉపనయనమైన పురుషులయొక్కయును మరణమందే యని తెలియవలయును.

సవతికూతురుచనిపోయెనేని సవతితల్లికిని సవతితల్లి ఆమెతల్లి, తండ్రి, సోదరులు, సోదరీలు, కూతులు, సో

(౨౨)తల్లితండ్రి తల్లితల్లి మేనమామ పినతల్లి పెత్తల్లి అక్క చెల్లెలు అక్కకొడుకు చెల్లెలికొడుకు అన్న తమ్ముడు అన్నకొడుకు తమ్మునికొడుకు మేనత్త వీరు వివాహమైన స్త్రీకిమొదట చనిపోయినని కూడుదినములును ఇతరస్థలమందుచనిపోయినని పక్షిణియునుయుండుట ఆంధ్రాచారము

ధరీపుత్రిక. సోదరీపుత్రుడు, సోదరపుత్రిక, సోదరపుత్రుడు, కొమారెకొమారుడు, కొమారెకొమార్తె వీరియొక్క మరణమందు వివాహమయిన స్త్రీకి ఒకదినము మైలయుండును.

భార్యయొక్క సోదరుడు తనయెదుట చనిపోయెనేని ఒకదినము మైలయుండును. ఇతరస్థలమందు చనిపోయెనేని మైలలేదు.

(౨౩) అల్లుడును తోబుట్టువు పెనిమిటియును చనిపోయెనేని స్నానమాత్రమువలననే శుద్ధియగును.

(౨౪) ఎవరైనను బుద్ధిపూర్వకముగా నీటిలోబడుట విషముదినుట ఉరివేసుకొనుట మొదలగుపనులవలన చనిపోయిరేని వారివారికి మైలలేదు.

పదవప్రకరణము ముగిసెను.

---

(౨౩) అల్లుడును తోబుట్టువు పెనిమిటియును తనయెదుట చనిపోయినయెడ నొకదినము మైలపట్టుటయును ఇతరస్థలమందు చనిపోయినయెడ మైలపట్టకపోవుటయును సాంధ్రాచారము.

(౨౪) ఎవరైనను బుద్ధిపూర్వకముగ నీటిలోబడుట మొదలగుపనులవలన చనిపోయిరేని వారిచావునుగురించి వారిజ్ఞాతులుమొదలగువారు ఒకదినము మైలపట్టుటయాంధ్రాచారము.

కాని ద్రావిడులును నాంధ్రులునుగూడ నైప్రకారముగ చనిపోయినవారిమరణమందుగూడ ప్రస్తుతమందు మైలపట్టుచునేయున్నారు

ఎనిమిదవప్రకరణము.

అతిక్రాంతాశౌచము.

—పురిటివిషయము—

పరోక్షమందు ఆనగా తమయెదుట కాకుండ సంభవించిన పురుడు పదిదినములమధ్య తెలియబడినయెడ నందరికిని ఆ తెలియబడిన దినము మొదలు మిగిలినదినములే యుండును గాని పదిదినములునుండదు.

పురిటి పదిదినములు దాటినపిమ్మట పురుడు తెలియబడెనేని ఎవ్వరునుపురుడు పట్టనక్కరలేదు పురుడు దాటినపిమ్మట తెలియబడినయెడ పుట్టినశిశువుయొక్క తండ్రికిగూడ స్నానమాత్రముననే శుద్ధియగును.

—మయిలవిషము—

యజ్ఞములను చేసినవారుగాని చేయనివారుగాని చనిపోయినప్పుడు మంత్రపూర్వకముగా దహనాదులు చేయబడక తిరుగాదశాహమధ్యమందు దహనసంస్కారము చేయబడినయెడ మిగిలియున్న దినములే మయిలగాని పిమ్మట చేయబడిన దహనసంస్కారదినము మొదలుపదిదినములు మయిలయుండదు.

యజ్ఞములుచేసినవారికి దశాహస్సుదాటిన తరువాత తిరుగా దహనముచేయబడినపక్షమందు అపునర్దహనదిన

ము మొదలు పదిదినములు జ్ఞాతులకుమయిలయుండును.

యజ్ఞములనుచేయనివారికి దశాహస్సు దాటినతరువాత అస్థిదహనము చేయబడినయెడ జ్ఞాతులుమొదట మయిలపట్టినట్లయితే ఆ యస్థిదహనదినము మొదలు పదిదినములు మయిలపట్టవలయును. మొదటమయిలపట్టి ఉదకదానమును చేయకపోయినయెడ మూడుదినములుమయిలపట్టవలయును. మొదటమయిలపట్టి ఉదకదానమునుకూడ చేసినతిరుగ మయిలపట్టనక్కరలేదు.

ప్రతికృతిదాహమందు మొదటమయిలపట్టనియెడమూడుదినములుమయిలపట్టవలయును. మయిలపట్టిఉదకదానము చేయకపోయినయెడ ఉదకదానసంబంధమయిన మయిలమూడుదినములుండును. మయిలపట్టుటయునుఉదకదానమును కూడ జరుపబడినట్లయితే జ్ఞాతులకుమయిలలేదు.

కొడుకులకైతే అస్థిదాహమందున్ను ప్రతికృతిదాహమందున్ను గూడ మొదటమయిల పట్టబడినను పట్టబడకపోయినను గూడ మయిలపదిదినములుండును.

పరోక్షమందుఅనగా తమయెదుటకాకుండా సంభవించిన మైలపదిదినములమధ్య తెలియబడినయెడ నందరికిని ఆ తెలియబడిన దినము మొదలు మిగిలినదినములేయుండును గాని పదిదినములునుండదు.

కౌమారునకు పదిదినములమధ్యమందు సంచయనముకం టెముందుగా తల్లియొక్కగాని తండ్రియొక్కగాని చావు కబురువినవచ్చినయెడ మిగిలినదినములే మైలయుండునుగా ని వినవచ్చినదినము మొదలు పదిదినములునుండదు.

సంచయనమయినపిమ్మట యేదినమునందైననుతల్లియొ క్కగాని తండ్రియొక్కగాని చావుకబురు తెలియబడినయె డ నాదినము మొదలు పదిదినములుమైలయుండును.

తనయెదుటకాకుండా యెక్కడనైనను సవతితల్లిచని పోయినవార్త సంవత్సరములోపల తెలియబడెనేని కన్న తల్లిమరణమందువలెనే పదిదినములుమైలయుండును.

సంవత్సరము దాటినపిమ్మట తెలియబడినేని ఉత్తర క్రియలు మరియెవ్వరిచేతనైన చేయబడెనేనిఒకదినముమా త్రమే మైలయుండును.

ఉత్తరక్రియలు చేయబడనియెడ సొంతతల్లిమృతియం దువలెనే పదిదినములును మైలయుండును.

ఉత్తరక్రియలుచేయబడినతరువాత సంవత్సరముదా టినపిమ్మట తల్లియొక్కగాని తండ్రియొక్కగాని మరణ వార్త తెలియబడినయెడ పెద్దకుమారునికంటె నితరకుమా రులకు మూడుదినములేమైలయుండును.

(౨౫) అతిక్రాంతమయిన పదిదినములమైల మూఁడుమాసములలోపల తెలియఁబడెనేని సపిండజ్ఞాతులకు మూఁడుదినములేమైలయుండును. మూఁడుమాసములుదాటి ఆరుమాసములుదాటకుండ తెలియఁబడినయెడ పక్షిణీయేయుండును. ఆరుమాసములుదాటి పండ్రెండుమాసములుదాటకుండ తెలియఁబడినయెడ నొకదినమే యుండును. పండ్రెండుమాసములుదాటినతరువాత తెలియఁబడెనేని స్నానమాత్రమువలననే శుద్ధియగును. ఈయతిక్రాంతాశౌచము ఉత్తరక్రియలు చేయఁబడినవారివిషయమే అయియున్నది.

ఉత్తరక్రియలు చేయఁబడనివారి విషయములోనైతే యజ్వాయజ్వులయొక్క పునర్దహనవిషయములో వెనుక చెప్పఁబడినప్రకారమే అయియున్నది.

అతిక్రాంతమైన మూఁడుదినములమైల మరణదినము మొదలు పదిదినములలోపల తెలియఁబడెనేని ఒకదినముండును.

అతిక్రాంతమైన పక్షిణి పదిదినములలో తెలియఁబడెనేని ఏకకాలము (అనఁగా రాత్రియందు తెలియఁబడితే ఆ రాత్రిమట్టుకే యుండుటయు పగటియందు తెలియఁబడితే ఆపగటిమట్టుకే యుండుటయు).

---

(౨౬) మాతాపితృవిషయములకంటె వేరైన యీయతిక్రాంతాశౌచము పదిదినములైనపిమ్మట తెలియఁబడినయెడ నాంధ్రులకు లేదు.

మూడుదినములమీఁదయును పక్షిణీమీఁదయును పదిదినములు దాటినతరువాత తెలియఁబడినయెడ స్నానమాత్రమువలననే శుద్ధియగును.

అతిక్రాంతమైనఒకదినముమీఁద పదిదినములలోపల తెలియఁబడినను స్నానమాత్రముననే శుద్ధియగును.

ఉపనయనముకానివాడు చనిపోయినపుడు తల్లి, తండ్రి, సోదరులు, వీరికంటె వేఱైన జ్ఞాతులకు అతిక్రాంతాశౌచముండదు.

ఉపనయనము కానివాఁడయినను ఏడవసంవత్సరముప్రవేశించినతరువాత చనిపోయెనేని తల్లి,తండ్రి, సోదరులు వీరికివలెనే జ్ఞాతులకును అతిక్రాంతాశౌచము ‟త్రిరాత్రం త్రిషు మాసేషు” అను నిత్యాది శాస్త్రప్రకారముగా పదిదినములు దాటినపిమ్మట మూఁడుమాసములలోపల తెలియఁబడెనేని మూఁడుదినములును మూఁడుమాసములు దాటినపిమ్మట నాఱుమాసములలోపల తెలియఁబడెనేని దినన్నరయును ఆఱుమాసములు దాటినపిమ్మట సంవత్సరములోపల తెలియఁబడెనేని ఒకదినమును ఉండును. సంవత్సరము దాటినపిమ్మట తెలియఁబడెనేని స్నానమాత్రముననే శుద్ధియగును.

తనపరోక్షమందు చనిపోయినట్టియు చేయఁబడినయుత్తరక్రియలుకలిగినట్టియు సోదరునియొక్క మరణవార్త అతఁడుమరణమొందిన ఆఱుమాసములలోపున వినవచ్చెనేని

యుతేనసోదరునికి మూడుదినములుమైల. ఏడవమాసమొ
దలు సంవత్సరములోపున వినవచ్చెనేని దినన్నర.
క్రియలు చేయబడని సోదరునకారుమాసములలోపున
గా నస్థిప్రతికృతిదహనాదులు చేయబడెనేనియతనిసో
రునకు పదిదినములుమైల. ఆరుమాసములపిమ్మట సం
ములోపల నస్థిప్రతికృతిదహనాదులు చేయబడెనేని మూ
డుదినములు. ఈవిషయములో సోదరునిదహనముచేసి
సోదరునకు పదిదినములుమైలయనివిశేషము. చేయబడి
యుత్తరక్రియలుగల సోదరునిమరణవార్త సంవత్సరము
దాటినపిమ్మటవినవచ్చెనేని సోదరునకొకదినముమైల. సం
వత్సరముదాటినపిమ్మట తిరుగా నస్థిప్రతికృతిదహనాదులు
చేయబడెనేని మొదటదహించిన సోదరునికి మూడుదిన
ములుమైల. దహించనివానికొకదినముమైల.

ఒకమైలవచ్చియుండగా దంపతులలో భర్తగానిపో
యినయెడ భార్యకును భార్యగాని పోయినయెడ భర్తకును (త
మదంపతిసంబంధి) వారివారిమరణదినము మొదలు పదిదిన
ములువెళ్ళిన పిమ్మటనే శుద్ధిగాని మొదటిమైలయొక్క శేష
ముచేత శుద్ధికాదు.

చేయబడినయుత్తరక్రియలుగల భర్తయొక్క పరో
క్షమరణవార్త సంవత్సరములోపల భార్యవినినను అట్టిభా
ర్యమరణవార్తభర్తవినినను పదిదినములుమైల. సంవత్సర
ముదాటినపిమ్మట వినినయెడమూడుదినములు భర్తకుగాని

డు శిశువుచనిపోయెనేని ఆశిశువుయొక్క తల్లిదండ్రులకు ను సపిండజ్ఞాతులకును పురిటిదినముల శేషములోనే అనగా నాశిశువు చనిపోవునప్పటికి మిగిలియున్న పురిటిదినముల లోనేశుద్ధియగును- అనగా శిశువుయొక్కమరణమునుగురించి తిరుగ పదిదినములును మయిలపట్టనక్కర లేదనుట-

(౨౬)పురిటియొక్క ఆఖరుదినమందు శిశువుచనిపోయెనేని యాశిశువుయొక్క తండ్రికిమాత్రము తిరుగరెండుదినములుమయిలయుండును అనగా పురిటియొక్క శేషదినముగాక మరిరెండుదినములనుట-

(౨౭) పురిటికొసదినమురాత్రి కొసజామునగాని అరుణోదయవేళయందుగాని శిశువుచనిపోయెనేని తిరుగమూడుదినములు మయిలయుండును-

పదిదినములుదాటని శిశువుయొక్కమరణమువలనవచ్చినమయిల వినాగా తక్కినయేమయిలయును పురిటియొక్క శేషముచేతపోదు-

---

(౨౮)పురిటికొసదినమురాత్రి కొసజామునగాని అరుణోదయవేళయందుగాని పిల్ల చనిపోయెనేని ఖననదినము మొదలు మూడుదినములు తల్లిదండ్రులు మైలపట్టుట యాంధ్రాచారము.

(౨౭)పురిటియొక్క పదియవదినమందు పిల్లచనిపోయెనేని యాపిల్లను ఖననముచేసినదినము మొదలు తల్లిదండ్రులకు రెండుదినములాశౌచముండుట యాంధ్రాచారము.

మొదటవచ్చినపురుడు యుంటుండగా యెవడైనను యెవనినైనను. తానుదహించదగినజ్ఞాతినొకనిని దహించినయెడ దాదహనదినము మొదలు పదిదినములు వెళ్ళినపిమ్మట నాదహించినవానికి శుద్ధిగాని మొదటవచ్చినపురుడుయొక్క శేషము వెళ్లినపిమ్మటకాదు.

—మయిలలో పురుడు—

మయిలయుండగా దానితో సమానపరిమాణముగల యింకొకపురుడువచ్చినయెడ దానికిని మొదటిమయిలశేషములో నేనివృత్తియగును.

మొదటవచ్చినమయిలకంటె తరువాతవచ్చినపురుడు అధికపరిమాణముగలదైనయెడ మొదటిదాని శేషముచేత పోక తనకు నిర్ణయింపబడిన కాలపరిమితిచేతనే పోవును.

మయిలమధ్యమంటు తనకు కొడుకుగాని కూతురుగాని పుట్టినయెడ నాశిశువునుకనిన తల్లిదండ్రులలో—

తల్లికి ఇదివరలో విధింపబడినప్రకారము మగశిశువును కనినట్లుఅయితే ముప్పదిదినములును ఆడుశిశువునుకనినట్లు అయితే నలువదిదినములును పురుడుండును.

తండ్రికి శిశువుపుట్టిన దినము మొదలు పదిదినములును పురుడుండును.

ఇద్దరికిని పూర్వపుమైలశేషముచేతనే శుద్ధికాదు.

—మైలలోమైల—

మైలయుండగా దానితోసమానపరిమాణముగలయిం కొకమైలవచ్చినయెడ దానికి మొదటిమైలశేషముతోనే యాశౌచము పోవును.

మొదటవచ్చినమైలకంటె తరువాతవచ్చినమైల యధికపరిమాణముగలదైనయెడ మొదటిదాని శేషముచేతపోక తనకునిర్ణయింపబడిన కాలపరిమితిచేతనే పోవును.

మైలయొక్క పదియవదినమందు మరియొకమైల వచ్చినయెడ నావచ్చినదానికి మొదటిదానిపదిదినముల శేషముచేతగాక మరి రెండుదినములచేత నివృత్తియగును.

పదియవదినముయొక్క రాత్రికొసజామునగాని అరుణోదయవేళయందుగాని వచ్చినయెడ మొదటిదానిశేషముచేతగాక మరిమూడుదినములచేత నివృత్తియగును.

పదియవదినము కొసజామునగాని అరుణోదయవేళయందుగాని వచ్చినమైల మొదటవచ్చినదానికంటె కొంచెముపరిమాణముకలదైనయెడ మొదటిదాని శేషముచేతనే రెండవదానికిని నివృత్తియగును.

జ్ఞాతిమరణాశౌచమధ్యమందు తల్లిగానితండ్రిగాని మృతినొందెనేని యాతల్లియొక్కగాని తండ్రియొక్కగాని

మరణదినమునుంచి యారంభించియే పదిదినములు వెళ్లినపి మ్మట శుద్ధిగాని జ్ఞాతిమరణాశౌచశేషముచేతశుద్ధికాదు-

జ్ఞాతిమరణాశౌచమందు భర్తచనిపోయెనేని భార్య కును భార్యచనిపోయెనేని భర్తకును వారివారిమరణదిన ము మొదలు పదిదినములపిమ్మటనే శుద్ధిగాని పూర్వాశౌచ శేషముచేత శుద్ధికాదు-

తల్లిమరణమువలనవచ్చిన మైలమధ్యమందు తండ్రిచ నిపోయెనేని తండ్రిమరణదినమునుంచి యారంభించియేప దిదినములైనపిమ్మట శుద్ధిగాని తల్లిమరణమువలనవచ్చిన యాశౌచముయొక్క శేషముచేత శుద్ధికాదు-

తండ్రిమరణమువలనవచ్చిన యాశౌచమధ్యమందు త ల్లిచనిపోయెనేని తండ్రిమరణపుమైలను సమాప్తినొందించి పిమ్మట పక్షిణీపట్టవలయునుగాని దశాహాశౌచమును పట్టన క్కరలేదు-

తండ్రిచనిపోవుటకు పూర్వదినమందుగాని తండ్రిచని పోయిన మరుచటిదినమందుగాని తల్లిచనిపోయినను—తల్లి తనభర్తకళేబరముతోగూడ నగ్నిప్రవేశముచేసి చనిపో యినను—తండ్రిచనిపోయినదినముననే కాలవశమున తల్లి చనిపోయినను—తండ్రియొక్కమరణమువలనవచ్చిన మైల యొక్క శుద్ధిచేతనే శుద్ధియగును గాన వేరుగా తల్లివిష

యుక్తమైన యాపత్తిశేయును పట్టనక్కఱలేదు.

మొదటవచ్చిన మైలయుండుండగా ఎవడైనను ఎవనినైననుతాను దహింపదగిన జ్ఞాతినొకనిని దహించినయెడ నాదహనదినము మొదలు పదిదినములు వెళ్లినపిమ్మట నాదహించినవానికి శుద్ధిగాని మొదటవచ్చినమైలయొక్క శేషము వెళ్లినపిమ్మట కాదు.

ఎవడైనను మొదటఎవనినైననుతాను దహించదగిన జ్ఞాతినొకనిని దహించి యాయాశౌచమధ్యమందు అనగా మొదటివానిని దహించినందువలనవచ్చిన యాశౌచమధ్యమందు తిరుగ నప్పవానినిమరియొకనినిగాని ఇద్దరినిగాని యనేకులనుగాని దహించినను మొదటివానిని దహించిన మైలశేషముచేతనే శుద్ధినొందునుగానిపిమ్మటిదహనముల ఈ వేఱేమైలలను పట్టనక్కఱలేదు.

ఒకనిని దహింపగావచ్చినమైలమధ్యమందు తల్లినిగాని తండ్రినిగాని ఇద్దరినిగాని దహించినయెడ వారిదహనదినము మొదలు అనగా తల్లిదండ్రులదహనదినము మొదలు పదిదినములు అయినపిమ్మట శుద్ధిగాని పూర్వపుమైలయొక్క శేషముచేత శుద్ధికాదు.

తాహ్మికప్రకరణము ముగిసెను.

పదవప్రకరణము.

అసగోత్రవిశేషాశౌచము.

ఏకనిగృహమందు శ్రోత్రియుడు చనిపోవునో ఆగృహయజమానునకు మూడుదినములు మైలయుండును.

శ్రోత్రియుడు కానివాడు చనిపోయినేని యొకదినము మైలయుండును.

(1) ఏగ్రామమందు శ్రోత్రియుడు చనిపోవునో ఆగ్రామమునకొకదినము మైలయుండును.

శ్రోత్రియుడు కానివాడు చనిపోయినయెడ గ్రామమునకు మైలలేదు.

సబ్రహ్మచారియును తనదేశపురాజును చనిపోయినేని యొకదినము మైలయుండును.

తనదేశపురాజు తనయెదుట చనిపోయినయెడ నొకదినము మైలగాని ఇతరస్థలమందు చనిపోయినయెడ నేకకాలమే.

ఆచార్యుడు ఆచార్యభార్య శిష్యుడు ఋత్విజుడు యాజ్యుడు వీరు చనిపోయిరేని మూడుదినములు మైలయుండును.

పదవప్రకరణము ముగిసెను.

---

(1) ఏగ్రామమందు శ్రోత్రియుడు చనిపోవునో ఆగ్రామమునకొకదినము మైలయుండుట ప్రస్తుతమాచరింపబడుచుండుట లేదు

పదకొండవప్రకరణము.

క్షత్రియ-వైశ్య-శూద్రాశౌచనిర్ణయము.

శ్లో॥ జన్మహాన్యోస్తు వర్ణానాం దశ షోడశ వింశతిః।
త్రింశన్నిశాః క్రమేణాఘమిత్యనేకర్షిసమ్మతం॥

ఇందుకర్థమేమనగా వర్ణానాం=బ్రాహ్మణక్షత్రియవైశ్య శూద్రవర్ణములవారికి జన్మహాన్యోస్తు=పుట్టుకచావు ఇవిసంభవించెనేని క్రమేణ=క్రమముగా దశ=బ్రాహ్మణులకుపది దినములును షోడశ=క్షత్రియులకు పదునారుదినములును వింశతిః=వైశ్యులకిరువదిదినములును త్రింశన్నిశాః=శూద్రులకు ముప్పదిదినములును అఘం=ఆశౌచము అనగా జాతాశౌచమృతాశౌచములుండును ఇతి=ఈలాగున అనగా నీయంశము అనేకర్షిసమ్మతం=బహుఋషిసమ్మతమని ఆశౌచశతకము పదునెనిమిదవశ్లోకమున చెప్పబడినది.

ఇదేప్రకారముగ హారీతస్మృతిలో

శ్లో॥ బ్రాహ్మణే దశరాత్రం స్యాత్ క్షత్రియే షోడశస్మృతాః।
వైశ్యే వింశతిరాత్రం స్యాన్మాసం శూద్రే విశుద్ధయే॥

అనియును ఈప్రకారముగనే పైఠీనసివాక్యగ్రంథములో

ఆశౌచమనుక్రమిష్యామో బ్రాహ్మణస్య దశరాత్రం
షోడశరాత్రం క్షత్రియస్య వింశతిరాత్రం వైశ్యస్య
మాసం శూద్రస్య।

అనియును విధింపబడియున్నది.

కాని మనుస్మృతి పంచమాధ్యాయములో నెనుబది మూడవశ్లోకములో

శ్లో॥ శుద్ధ్యేద్విప్రో దశాహేన ద్వాదశాహేన భూమిపః॥
వైశ్యః పంచదశాహేన శూద్రో మాసేన శుద్ధ్యతి॥

అనగా బ్రాహ్మణుడు పదిదినముల చేతనును క్షత్రియుడు పన్రెండుదినముల చేతనును వైశ్యుడు పదునేనుదినముల చేతనును శూద్రుడు మాసముదినముల చేతనను శుద్ధుడౌం డునని చెప్పబడియున్నది.

కాని మనుస్మృతివాక్యానుసారముగ ఆంధ్రదేశమునందుండు గౌరకోమటులను వైశ్యులుమాత్రము సపిండాశౌచమును పదునేనుదినములు పట్టుచున్నారు- సమానోదక సగోత్ర అసగోత్రాశౌచములాంధ్రబ్రాహ్మణులరీతినే పట్టుచున్నారు- ఆంధ్రవైశ్యులలో కేవలము శ్రీవైష్ణవమతావలంబులైన త్రైవర్ణికులనువారును ఆంధ్రక్షత్రియులును సర్వాశౌచములను నాంధ్రబ్రాహ్మణులరీతినే పట్టుచున్నారు.

శూద్రులకు సర్వస్మృతులలోనును మాసముదినములు జ్ఞాత్యాశౌచము విధింపబడినను వెలమదొరలు కమ్మవారు తెలగాలు తెలుకుల్లు మొదలగువారాంధ్రబ్రాహ్మణులరీతినే సర్వాశౌచములను పట్టుచున్నారు- గాజులకాపులు చాకలులు మంగళ్లు మొదలగువారున్ను మంచినక్షత్రమును చూచి చనిపోయినవారికి వెంటనేగాని మూడునాలుగైదు

దినములలోగాని శ్రాద్ధమును జేసి యాశౌచమును విడుచుచున్నారు అనగా శుద్ధినొందుచున్నారు.

శూద్రాణాంతు సధర్మాణస్సర్వేపధ్వస్తజాస్స్మృతాః॥

అనియెడుమనువచనమునుబట్టి అపధ్వస్తజులనబడువర్ణసంకరులకు శూద్రులకువలెనే యాశౌచము విధింపబడినది.

ఈశూద్రులలోనే విష్ణుభక్తులగువారికి

మాసార్ధం వైష్ణవే శూద్రే దాసదాస్యాశ్చ శార్ఙ్గిణః॥

అని యాశౌచశతకమందును

శ్లో॥ చక్రాంకితాశ్చ యే శూద్రా ముద్రభా వత్సరాయణాః।
తేషాం విప్రస్య దాసానామాశౌచం చార్ధమాసకం॥

అని విష్ణుధర్మోత్తరమందును విష్ణుమతస్థులై యాసంస్కారములనుపొందిన శూద్రులకు పదియేనుదినములాశౌచము విధింపబడియున్నది.

ఇట్లు శూద్రులకాశౌచము విధింపబడినను

శ్లో॥ దాసీదాసస్యపామాత్యకారకశ్శిల్పినోభిషక్।
స్వస్వకృత్యే సదాశుద్ధాశ్శుద్ధా నైవాన్యకర్మసు॥

అని యాశౌచశతకములోని యెనుబదిమూడవశ్లోకమునచెప్పబడియున్నది. ఇందుకర్థమేమనగా దాసీలును నౌకరులును ప్రజాపాలకులగు ప్రభువులును మంత్రులును చాకలులు మంగలులు మొదలగువాండ్రును బంగారువెండిమొ

దలగు లోహపుపనులును కఱ్ఱపనులును రాతిపనులును
తోలుపనులును రంగులువేయుటయును చేయువాండ్రు
శిల్పులనబడుదురు గనుక వారును వైద్యులును వారువారు
చేయతగినపనులయందు వారెప్పుడును శుద్ధులు గనుక వా
రికాశౌచమువచ్చినను వారితరులయిండ్లకువచ్చి వారివారి
పనులు చేయవచ్చుననియును అట్లు వారిచేత పనులు చే
యించుకొనుటవలననితరులకు వారియాశౌచప్రయుక్తమైన
యశుద్ధి రాదనియును తాత్పర్యము శుద్ధానైవాన్యకర్మసు
అను చతుర్థపాదములో పఠింపబడిన యంశమేమనగా
అన్యకర్మసు=వారికి విధింపబడిన కార్యములుగాక నితరకా
ర్యములయందు నైవశుద్ధాః=శుద్ధులు కారు అని తాత్పర్యము

ఆయాశౌచశతకములోనే దానిపిమ్మటిశ్లోకములోనే

న విశేద్దేవతాగారం న కుర్యాద్వందనాద్యఘీ।

అఘీ=అనగా నాశౌచముకలవాడు దేవతాగారం=దేవాల
యమును న విశేత్=ప్రవేశింపకూడదు వందనాద=నమ
స్కారము మొదలగుదానిని నకుర్యాత్=చేయగూడదు ఇ
క్కడవందనాది అను నాదిశబ్దముచేత పుష్పాహరణపూ
జోపకరణస్పర్శాది గృహ్యతే అని వ్యాఖ్యానములో చె
ప్పబడియుండుటచేత దేవపూజకొరకైనపుష్పములను తె
చ్చుటయును దేవపూజోపకరణములైన ఉదకచందనపా
త్రాదులను ముట్టుకొనుటయును కూడదని తాత్పర్యము.

ఈ పైయంశములనుబట్టి బాగుగానాలోచించగా వైష్ణవసంస్కారములులేని దాసీదాసన్న్యపామాణ్యాదులైనశూద్రులు వారివారివృద్ధాచారప్రకారముగ కొంచెము రోజులలోనే ఉత్తరక్రియలు చేసి శుద్ధిపొందితిమనుకొన్నను సకలశాస్త్రసమ్మతమైన ముప్పదిదినములయాశౌచముకొఱకును వైష్ణవసంస్కారవిశిష్టులైనశూద్రులు పదియేనుదినములకొఱకును దేవాలయప్రవేశాదులను వర్జించవలయునని ఫలితము తేలుచున్నది.

ఇట్లనే క్షత్రియులు పదునారుదినములకొఱకును వైశ్యులిరువదిదినములకొఱకును దేవాలయప్రవేశాదులను వర్జించవలయును

ఆశౌచాంతమందు బ్రాహ్మణుడును క్షత్రియుడును వైశ్యుడును శూద్రుడును సంగవకాలమందు అనగా పగటిప్రమాణమును అయిదుభాగములు చేసి అందులో రెండవభాగమందు స్నానము చేసి బ్రాహ్మణక్షత్రియవైశ్యులు నూతనయజ్ఞోపవీతధారణము చేసి బ్రాహ్మణుడుదకమును క్షత్రియుడశ్వగజరథాదివాహనములను వైశ్యుడు కొరడానుగాని త్రాటినిగాని ముట్టుకొనవలయును. శూద్రుడు చేతికఱ్ఱను ముట్టుకొనవలయును. ఇట్లు చేసిరేని శుద్ధులగుదురు.

ఆ॥వె॥ ఇట్లు చెప్పబడిన యర్థములయందు।

సంశయింపదగదు సరసుల్లకును|
సంశయించిరేని సాక్షులౌ ధర్మశా|
స్త్రముల దృష్టిదీర జదువవలయు॥

ఆ|వె॥ మూలవిధుల విడిచి ముఖ్యమౌ నొక|
యర్థమునను నిశ్చయింప మొనయనైతి|
గాన తెలియనిచ్ఛగలిగిన ఘనులెల్ల|
గొనఁగదగును దీనిఁగొంకులేక॥

గద్యము.

ఇది వేదాంతవిజయధ్వజనామకవంశబిరుదశోభిత కౌశిక గోత్రపవిత్ర వింజమూరి రామానుజాచార్యపౌత్ర శ్రీనివాసాచార్యమంగాంబాపుత్ర వేంకటనృసింహాచార్యేంద్రధీకృతంబగు నఘువివేచనంబను నాశౌచసర్వస్వము సంపూర్ణము.

ఓంతత్పరబ్రహ్మార్పణమస్తు.